# గాజుల చెయ్యి

"ఏమిటి మళ్ళీ ఇల్లంతా అలంకరిస్తున్నావు ? ఎవరిదగ్గర్నుంచయినా కబురు గాని ఉత్తరంగాని వచ్చిందా ?" కామేశం భార్యనడిగాడు. అప్పటికే ఆమె కిటికీలకు దర్వాజాలకూ పరదాలు మార్చింది. పూలతొట్టెల్లో పచ్చటి లిల్లీలకుండీలు హాల్లో అక్కడక్కడ పెట్టింది. అమ్మాయివేసిన చిత్రాలు గోడలకు తగిలించింది. కుర్చీలు బల్లలు బట్టతో శుభ్రంగా తుడిచింది.

"మీక్కూడా హాస్యంగాఉందా నన్నుచూస్తే ? అసలే అవమానాలతో సగం చచ్చిఉన్నాను'' ఆమె కంఠం అంతలోకి రుద్ధమైంది.

"చూడు మాలా ! నేను నిన్ను హాస్యం చేస్తున్నానని ఎట్లా అనుకున్నావు ? నేను పైకి ధైర్యంగా ఉన్నానుగాని-మనసులో నాకెంత బెంగగాఉందో తెలుసా ? వచ్చి చూసిపోయే పెళ్ళికొడుకులను తలుచుకుంటే నాకుమాత్రం బాధగా లేదా ? ఇది నీ ఒక్కదాని సమస్యకాదు. నీది-నాది-అమాయ్మిదీను. సమిష్టిసమస్య. మనిద్దరినీ చూసి దానిముఖం ఎంతచిన్నబోతున్నదో నాకంటె నీకే బాగాతెలుసు. మళ్ళీ ఎవరయినా చూడటానికి వస్తామన్నారా అని మామూలుగా అడిగాను. కాని, ఈ విషయంలో నీతోటి హాస్యమా ? అందులో నాకు ?" అన్నాడు నొచ్చుకుంటూ.

''పురోహితుడు వచ్చి చెప్పివెళ్ళాడు. మామునూరిలో ఒక సంబంధం ఉందనీ, పిల్లనుచూసిగాని ఏమాటా చెప్పమని అంటున్నారనీ ఒకనెలకిందట చెప్పాడు. వాళ్ళు పిల్లలను చూడటానికి ఈ ఊరువచ్చి వాళ్ళ బంధువుల ఇంట్లో దిగారట. ఇవాళ ఐదుగంటలకు వస్తామని తనకు కబురుచేశారట. వచ్చిచెప్పాడు. సరే. అన్నిటిలో ఇదొకటనుకుని ఈ ప్రయత్నాలు అంతే మరేంలేదు. ఇల్లు సర్దాను. స్వీట్లూ హాట్లూ మనకు అచ్చిరాలేదు. మామిడిపళ్ళు తెప్పించి ముక్కలు కోసిపెట్టాను. వాళ్లు వచ్చిన తరువాత టీ చేస్తాను'' అంటూ, వంటయింట్లోకి వెళ్ళింది టీ కప్పులు తుడిచి ట్రేలో పెట్టటానికి.

''అదాసంగతి ! అప్పుడే నాలుగున్నరయింది. అన్నిపనులూ నీవేచేశావు. నేను కాస్త బట్టలు మార్చుకుంటాను. అన్నట్టు మాలా ! మిన్నీ కాలేజినుంచి వచ్చిందా ?'' బాత్‌రూమ్ వైపుకు నడుస్తూ ప్రశ్నించాడు.

"అది మూడున్నరకే వచ్చింది. ఈ కబురుచెప్పగానే ముఖం ముడిచింది. 'అట్లా పెట్టుకోకు. కాస్త నవ్వుముఖం పెట్టు. మంచి చీరెకట్టుకో. తలదువ్వుకో' మంటే ఏమందో తెలుసా ? "ఎన్నిసార్లమ్మా ఈ ప్రదర్శన ?'' అని విరుచుకు పడ్డది. పైగా ఇంకోమాటంది. ''అమ్మా. నీకు పెళ్ళిచూపులు ఎన్నిసార్లయ్యాయి? ఇలాగే అలంకరించుకుని కూర్చున్నావా పెళ్ళికొడుకుల ముందర ?" అంటూ విరగబడి నవ్వింది.

"మరి-నీవెన్నిసార్లు కూర్చున్నావు ? అన్నట్టు నాకూ వినాలనేఉంది చెప్పు!" అన్నాడు కామేశం చిరునవ్వుతో.

"నేనా ? పాతికేళ్ళకిందట అలంకరించుకుని ఒంటినిండా నగలుపెట్టుకుని తలవంచుకుని కూర్చున్నాను. పెళ్ళికొడుకువెంట పదిమంది వచ్చారు. ఒకాయన 'చదువు వచ్చా ?' అనడిగాడు. ఒకాయన చదవమన్నాడు వాళ్ళముందర. ఒకరు పాటలు పాడించారు. కాఫీలు టిఫిన్లూ తాంబూలాలూ అయ్యాయి. ఊరికివెళ్ళి ''మీపిల్ల అబ్బాయికంటె పొట్టిగా ఉంద'ని పురోహితుడితో అన్నారట.

''అయితే ఒక్కటేనా అమ్మా నీకు వచ్చిన సంబంధం ?'' మిన్నీ నవ్వింది.

''ఒక్కదాంతో అవుతాయా పెళ్ళిళ్లు? రెండోది-మీనాన్న. మా అమ్మకు తమ్ముడివరస. వచ్చిచూశారు నలుగుర్ని వెంటబెట్టుకుని లాంఛనంగా. పాడించకుండా-నడిపించకుండా-చదివించకుండా ఒప్పుకున్నారు. గాని ఎన్నాళ్ళకోగాని జవాబు చెప్పలేదు. మా అమ్మకు కోపంవచ్చింది. వస్తే ఏంచేస్తుంది కనుక? నాలుగు నెలలకు జవాబు వచ్చింది లగ్నాలుపెట్టించమని. ఒక ఆట ఆడించారు మా వాళ్ళను'' అంది అప్పటి సంగతి తలుచుకుని చెప్పతున్నట్టుగా.

''పోనీలే మాలా. నేనేమనలేదుకదా ? పెద్దవాళ్లచేతులు మీదుగా అయే పెళ్ళిళ్ళు ఇట్లాగే ఉంటాయి.'' అన్నాడు కామేశం ఇప్పటిఅనుభవంతో. అంతలో మిన్నీ వచ్చింది.

"అమ్మో. నేను స్కూల్లో కాలేజీలో ఇంతవరకూ ఫస్టుక్లాసు స్టూడెంటును. కాని- ఈ పెళ్ళికొడుకులు ఎన్నిసార్లు తప్పిఉంటారో ? 'మొదటినుంచి ఫస్టుగా ప్యాసవుతూ వచ్చారా ?' అని నేనడగవచ్చా ? కాని-మీరు అడగనివ్వరు. నాకంటె చదువులో తప్పుతూ ప్యాసయినవాడిని ఎంత పెద్ద ఉద్యోగి అయినా నేను చేసు కుంటానా ?'' అంది తల ఎగరవేస్తూ.

"అవన్నీ పెళ్ళయిన తరువాత అడిగి తెలుసుకో. అలిగికూర్చో. చేత నయితే తగవులాడు. ఇప్పుడుమాత్రం అడగకు మా తల్లివిగా" నవ్వింది మాల.

''ఈ ఒక్కసారి నీ మాట వింటాలే" అంది బుద్ధిమంతురాలిగా మిన్నీ.

అటువంటి సందర్భాలలో పెళ్ళికూతుళ్ళు ముందు వింతగా బిగించుకుని కూర్చున్నా చివరికి పెద్దలమాట విననేవింటారు.

పెళ్ళివారు వచ్చారు. ఫలహారాలు తిని టీ తాగారు. ''ముగ్గురు రాకూడదని నలు గురు వచ్చామ''ని ముందే క్షమాపణ చెప్పారు.

కామేశం-వాళ్ళు ఇంకా ఏం మాట్లాడుతారోనని ఎదురుచూస్తున్నాడు. అతడికి రెండు నెలలనుంచి మనస్థిమితం లేదు. మనసు బెరుకుగా ఉంది.

''అన్నిసంగతులూ పురోహితుడు చెప్పాడు.'' అని వాళ్లన్నారు.

మిన్నీకి పెళ్ళికొడుకు తెలిసినవాడిలాగే ఉన్నాడు మిన్నీకంటికి ఆచినట్టే ఉన్నాడు. జోకులేసుకుంటూ నవ్వుకుంటూ మాట్లాడుకున్నారు. వాళ్ళను చూసి అందరూ పెళ్ళిచూపులమాట మర్చిపోయి రాజకీయాలూ లోకం తీరుతెన్నులను గురించి కబుర్లలోపడ్డారు. ఏడుగంటలయ్యేవరకూ వాళ్ళకు లేవాలని తోచలేదు. గడియారం జ్ఞాపకంచేసిన తరువాత లేచారు.

అందరూ స్నేహితులతో సరదాగా మాట్లాడినట్టుగా హాయిగా నవ్వుతూ 'రేపు మా పురోహితుడు వస్తాడ'ని వెళ్లారు.

వికసించిన ముఖాలతో మాలా కామేశంలు వాళ్లను సాగనంపారు. కాని మరునాడు పురోహితుడు వచ్చేవరకూ సస్పెన్సును భరించలేకపోయారు.

కామేశం మనసులో ఏవేవో ఆలోచనలు.

మాలకు నిరాశా-నిస్పృహ.

ఆ రాత్రి పడుకున్న కామేశానికి నిద్రరాలేదు. ఇంట్లో అటూ ఇటూ ఊరికే కాలుకాలిన పిల్లిలా తిరగటం మొదలుపెట్టాడు.

రెండు నెలలనుంచీ తన గది కిటికిలో తెల్లవారి లేచేసరికి ఒక కాగితం మడత కనబడుతోంది. ''ఏమిటీ కాగితాలు గదికిటికీలో!'' అంటూ చించి బుట్టలో పడేస్తూ వచ్చాడు. ప్రతిరోజూ ఒక కొత్త కాగితంమడత కిటికిలో తెల్లవారేవరకూ ఉంటోంది. ఒకనాడు భార్యను పిలిచి "మనింట్లో కిటికీలు శుభ్రంగా ఊడ్పించి తుడిపించు" అని చెప్పి ఆఫీసుకు వెళ్ళాడు.

మళ్ళీ మరునాడు ఒకకొత్త కాగితం మడత ప్రత్యక్షమైంది.

''ఏమిటీ వెధవ కాగితాలు ? ప్రతిరోజూ తీయిస్తున్నా మరునాటికి మళ్ళీ ప్రత్యక్షమవుతున్నాయి'' అంటూ కనుబొమలు ముడిచి ఆ కాగితం మడతను విప్పిచూశాడు.

అది ప్రేయసీ ప్రియుల మధ్యనడిచిన ఉత్తరం. అబ్బాయి రాస్తున్నాడు ''ఎన్నాళ్ళకూ జవాబు రాయనిదానవు మొన్న ఒకటి రాశావు చాలా సంతోషం'' అంటూ.

అతడికి మిస్సీమీద అనుమానంతోచింది. ''ఇది బాయ్‌ఫ్రెండుకు ఉత్తరాలు కూడా రాస్తున్నదా ?'' అనుకుంటూ తల తడుముకున్నాడు. అటువంటి పిల్ల "నా గదిలో కిటికీలో ఉత్తరాలు పెట్టమని చెబుతుందా, తన గదిలో పెట్టించు కుంటుంది గాని ?'' అని మనసులోనే చర్చించుకున్నాడు. మరునాడు తెల్లవారు ఝూమున నాలుగుగంటలకే కళ్ళుతెరుచుకుని కిటికీవైపే చూస్తూ పడుకున్నాడు.

మిస్సీ ఏడుగంటలకు గాని నిద్రలేవదు.

మాల ఇంటిపనులలో మునిగిపోయి ఉంటుందావేళకు.

సరిగ్గా ఐదుగంటలకు ఒక చెయ్యి కిటికీలో ఆ కాగితం మడతను జారవిడుస్తోంది. ఆ చేతినిండా గాజులు, వేళ్ళకు రెండు ఉంగరాలు.

అతడు దిగ్గునలేచి కిటికీలోనుంచి చూశాడు.

ఆమె వెనక్కు తిరిగిచూడకుండా గబగబా అడుగులు వేసుకుంటూ వెళ్ళి పోతున్నది.

అతడికి ఆశ్చర్యం వేసింది.

ఆమె ఎవరయి ఉంటుంది ?

ఆ మరునాడు మళ్ళీ పరీక్షగా చూశాడు.

ఆమె ఎవరోకాదు, పక్కయింటి శేషమ్మగారు.

అవి గవర్నమెంటువారు కట్టిన ఇళ్ళుకనుక, ఇళ్ళమధ్య ఎక్కువస్థలం విడవ కుండా దగ్గర దగ్గరగా కట్టారు. మధ్య గోడలుకూడా అంత ఎత్తుగా లేవు.

పాపం, పక్కింటి శేషమ్మగారి కూతురికి ఎన్నో సంబంధాలు తప్పిపోతు న్నాయి. తన కూతురికి తప్పిపోతున్నందుకు విచారమే కాకుండా. మిన్నీకి ఎక్కడ సంబంధం కుదురుతుందోనన్న భయం కూడా పీడిస్తుంది ఆమెను. అదీ గాక ఆమె కూతురు అరమరికలులేకుండా మగపిల్లలతో మాట్లాడుతుంది. సినిమా లకు వెళ్ళుతూ ఉంటుంది. ఏదో పిల్ల సరదాపడి వెళ్ళుతోందనుకుంటుంది గాని అంతకంటె వాటి మంచిచెడ్డలను గురించి ఎక్కువ ఆలోచించని మనిషని అందరూ చెప్పుకుంటారు.

ఇదంతా తెలుసు కామేశానికి, గాని ఆమె తన కూతురికి వచ్చిన ఉత్తరాలు ఇటు మళ్ళిస్తోందని అనుకోలేదు. అంత సాహసిస్తుందని కలలోకూడా ఊహించ లేదు.

అప్పుడు మొదలయిందతడికి అనుమానం. మిన్నీకి తప్పిపోయిన సంబంధా లన్నీ ఈ శేషమ్మగారి వల్లనే నేమోనని.

ఆ మరునాడు తనే కిటికీ ముందర కుర్చీలేసుకుని కూర్చున్నాడు.

శేషమ్మ మామూలుగా వచ్చి కిటికీలో చెయ్యి పెట్టింది. అక్కడ ఒక డబ్బాలో ఇసకపోసి సూదులు మొనలు పైకి అమర్చి పెట్టాడు. ఆమె చేతికి సూది మొనలు కసుక్కున దిగబడ్డాయి.

అమ్మో అనుకుంటూ గబగబా వెళ్ళిపోయింది. ఆమె గోడదగ్గర మలుపు

తిరుగుతుండగా స్పష్టంగా ముఖం కనబడ్డది. ఆమె చెయ్యి ఊదుకుంటూ వెళ్ళింది.

ఇదంతా తెల్లవార్లూ కామేశం మనసులో ఫిల్మురీలులా తిరిగి గగ్గోలు పరుస్తున్నది.

మాలతో చెబితే మరింత గాభరాపడుతుందని కడుపులోనే దాచుకున్నాడు.

ఆ రాత్రంతా జాగరణ అతడికి. కళ్ళు ఎర్రగా ఉన్నాయి. మామూలు వేళకు లేచి ముఖం కడుక్కుని బల్లదగ్గరకొచ్చాడు.

"ఏం కళ్లు అట్లాఉన్నాయి? రాత్రి నిద్రపోలేదా ఏమిటి, నన్నంటారు గాని పురోహితుడు వస్తాడో రాడోనన్న దిగులు మీకూఉంది అవునా?'' మాల కాఫీగ్లాసు చేతికిస్తూ అడిగింది.

''అబ్బే, నేనాసంగతే మరిచిపోయాను. వస్తాడు ఇప్పుడేగా తెల్లవారింది? వస్తే సరేసరి, రాకపోతే తప్పిపోయిన వాటిల్లో ఇదొకటి. ఏమంటావు?''

మనసులో దిగులున్నా ఒకరికొకరు పట్టుబడకుండా మాట్లాడుకుంటూ కాఫీ తాగారు.

''తొందరగా వంటచేస్తాను. మిస్సి కాలేజిలో చీరెల ఎగ్జిబిషన్ ఉందట. నన్నుకూడా రమ్మంటోంది. మీరు ఆఫీసుకు వెళ్ళగానే మేమూ అటు వెళ్తాం'' అంటోంది మాల.

శేషమ్మగారి సంగతి పురోహితుడికీ తెలుసు ''ఏ కాలనీలో ఉన్నా ఇదే పని చేస్తుందామె" అనుకుంటూ ఉరుకుపరుగులమీద వచ్చాడు.

అప్పటికే శేషమ్మగారు వచ్చి కూర్చుని కాఫీ తాగుతూ "ఏమిటీ మీ ఇంట్లో నిన్న నవ్వులూ మాటలూ బిగ్గరగా వినబడ్డాయి?'' అని అడుగుతోంది. అంతలో పురోహితుడు కనబడగానే "మా యింటికి కూడా ఒకసారి వచ్చి వెళ్ళండి ఆడపిల్ల గలవాళ్ళం కదా?'' అంటూ లేచి వెళ్ళింది.

పురోహితుడిని చూడగానే కామేశానికి ఆదుర్దా ఎక్కువైంది.

మాలకు ఏం చెబుతాడోనని మనసు గుబగుబలాడింది. లేచి ఆయనకు గ్లాసెడు పాలు తెచ్చి ఇచ్చింది.

''అయ్యా, వాళ్ళందరూ సంతోషంగా ఉన్నారు. ఆ పెళ్ళికొడుక్కు-'ఇంకేమిటాలస్యం?'' అన్నట్టుగా ఉంది ముఖం. నన్నే లగ్నం పెట్టమని అబ్బాయి తల్లి చెప్పింది. అది మనచేతిలో ఉన్నదే కనుక అమ్మాయి పెళ్ళి వచ్చే వారమేననుకోండి. మీరు ప్రయత్నాలు చేసుకోవచ్చు. ఏదీ మృణాళిని? ఈ కబురు నేనే స్వయంగా ఆమె చెవిన వేద్దామనుకున్నాను'' అన్నాడు.

''నాకు ముందే తెలిసిందండి, పొద్దున నాకు టెలిఫోను వచ్చింది" అన్నది మిన్నీ తన గదిలోనుంచి బైటికి వస్తూ.

"ఇంకేమమ్మా ? నేను చెప్పకుండానే నీకు తెలిసిపోయింది, శుభం. వెళ్ళా ఒక మాట మీ అమ్మగారితో చెప్పాలనుకుంటున్నాను. ఏమిటంటే మీ పక్కింటి శేషమ్మగారుందే, ఆవిడ 'ఆ పెళ్ళి అయినప్పుడు చూద్దాంలే, అని అంటోందట-అప్పుడే. నేను వస్తుంటే దారిలోనే ఒకాయన అన్నాడు నాతో".

''ఏం భయం లేదులెండి'' అన్నది మిన్నీ.

''అమ్మపిల్లా ! ధైర్యం గలదానవే'' అంటు నవ్వుకున్నాడు పురోహితుడు.

కామేశం మనసు శాంతించింది.

మాల కళ్ళ ఎదుట వధూవరులిద్దరూ అగ్నిహోత్రం చుట్టూ చేతులు పట్టుకుని ప్రదక్షిణాలు చేస్తున్నారు కొంగులు ముడివేసుకుని.